

తెలంగాణ మేరు యువజన సంఘం అధ్యక్షుడు, టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాల్కం శ్రీనివాస్ మేరు శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి దర్జీలు(మేరు) కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలను ఆదుకోవడానికి కుట్టుపని టెండర్ల రేట్లు పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



బంజారాకాలనీలో ధ్వంసమైన డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

ధ్వంసమైన భూగర్భ డ్రైనేజీ పరిశీలన

హయత్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో ధ్వంసమైన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుక్రవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. మ్యాన్‌హోల్ నిర్మించి చాలా కాలం కావడంతో అది పూర్తిగా చెడిపోయిందని తెలిపారు. ఇటీవలి కాలంలో అనేక వాహనాలు దాని పై నుంచి వెళ్లడంతో మ్యాన్‌హోల్ దెబ్బతిని పాడైపోయిందని అన్నారు. పాడైన మాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి బాగు చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జాంజ్యానాయక్, బాలునాయక్, భరత్‌నాయక్, చిరంజీవినాయక్, నాయకులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.15లక్షలతో కొత్తపేట బస్తీ నుంచి మారుతీనగర్ గురుమందిర్ వరకు కొనసాగుతున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జలమండలి అధికారులతో ఆయన మాట్లాడుతూ వర్షాలు మొదలయ్యేలోగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. బస్తీ ప్రతినిధులు గోపాల్‌యాదవ్, కృష్ణయాదవ్, మధు, రాజుల పాల్గొన్నారు.

టెట్‌కు 344 మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూనాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రై.లి.లో శుక్రవారం ఆన్‌లైన్ టెట్‌కు 344 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185మంది అభ్యర్థులకు గాను 168 మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185మందికి గాను 176 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 17 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 9మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: డీఎం



ఎన్జీవోస్‌కాలనీ బస్‌డిపోలో తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో డీఎం శ్రీనివాస్, విజయ్‌నేత

వనస్థలిపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ ఆర్టీసీ డిపో డీఎం శ్రీనివాస్ అన్నారు. ఎన్జీవోస్‌కాలనీ ఆర్టీసీ బస్ డిపోలో టీడీపీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తాగునీటి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో జీఎం విజయ, రమాదేవి, సంపత్, లక్ష్మీనారాయణ, పంపన వెంకటేశ్వరరావు, పీ.వీ సత్యనారాయణ, సుబ్బారావు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్యశిబిరంలో కాలనీవాసులు

వనస్థలిపురం, మే 31(ఆంధ్ర జ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ప్రగతినగర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ గడ్డిఅన్నారం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీ.పీ ప్రసాద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు, సీనియర్ సిటిజన్ల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 60మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు రీసెర్చ్ అధికారి డాక్టర్ క్రిస్ ఆంటోని, శ్రీవాణి, కార్తికేశ్వరి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు బీ.వీరారెడ్డి, కార్యదర్శి ఇ.సత్యనారాయణ, బీ.బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

- వీరిలో ఇద్దరు మైనర్లు
- కత్తులు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాటిని చూపిస్తున్న డీసీపీ గిరిధర్‌రావు, ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్: దోపిడీ దొంగల ముఠా ను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కత్తులు, రెండు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లు, వెయ్యిరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాలు వెల్లడించారు. మే 29వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో మహ్మద్‌గూడ అక్బర్ హోటల్ వద్ద పద్మారావునగర్‌కు చెందిన విద్యార్థులు గౌతమ్, రాజకుమార్‌తో పాటు మరో యువకుడు యువతి చదువు విషయంపై మాట్లాడుకుంటున్నారు. అక్కడకు వచ్చిన దోపిడీ దొంగల ముఠా సభ్యులు మహ్మద్ రహీమ్ బేగ్ అలియాస్ రహీమ్, మహ్మద్ షేక్ హుస్సేన్ అలియాస్ సోను, మహ్మద్ సమీర్, సయ్యద్ అహ్మద్ పాషా అలియాస్ అఫీర్, మహ్మద్ వాసిదుద్దీన్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు వారితో వాగ్వాదానికి దిగారు. విద్యార్థులు పరుగు తీయగా దోపిడీ దొంగల ముఠా సభ్యులు వారిని వెంబడించారు. మైనర్ కర్రతో వారిని కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. రాజ్‌కుమార్ అనే యువకుడి వద్ద సెల్‌ఫోన్, వెయ్యిరూపాయలు లాక్కున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామని దోపిడీ దొంగలు బెదిరించారు. గౌతమ్ అదేరోజు రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన గౌతమ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తంగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దృశ్యాల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గురువారం రాత్రి వారాసిగూడ చౌరస్తాలో ఐదుగురు యువకులను, ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. మహ్మద్ రహీమ్ బేగ్‌కు నేరచరిత్ర ఉందని, మైనర్‌గా ఉన్నప్పుడే ఫైజల్ అనే యువకుడి హత్య కేసులో నిందితుడని డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు అందజేస్తామని డీసీపీ చెప్పారు.

- పేద కిడ్నీ బాధితులకు వరం
- పది యంత్రాలతో రోజుకు 40మంది రోగులకు చికిత్స
- 80 నెలల కాలంలో సుమారు 40వేల మందికి సేవలు

మలక్‌పేట డయాలసిస్ కేంద్రం

సేవలు భేష్



మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

సైదాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్(మూత్రపిండాలకు ప్రత్యామ్నాయంగా రక్తాన్ని శుద్ధిపరిచే ప్రక్రియ) కేంద్రం కిడ్నీ రోగులకు వరంగా మారింది. డబ్బులు పెట్టి ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు పొందలేని వారికి బాగా ఉపయోగపడుతుంది. రక్త శుద్ధితో పాటు మందులు ఉచితంగా అందిస్తుండడంతో పేదలకు ఆర్థిక భారం తప్పింది. మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం బాధితుల్లో మనోధైర్యాన్ని అందిస్తూ 24గంటలు వైద్య సేవలందిస్తూ రోగుల మన్ననలు పొందింది. మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో 24 అక్టోబర్ 2017లో ఐదు పడకలతో ప్రారంభమైంది. ఈ 80నెలల కాలంలో సుమారు 40వేల మందికి సేవలు ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఉన్న పది పడకలతో పది యంత్రాల ద్వారా ప్రతి రోజు నాలుగు విడతలుగా 40-45 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. నేడు ఒత్తిడితో కూరుకున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు తదితర కారణాల వల్ల కిడ్నీ విఫలమవుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వీరికి వారానికి మూడు సార్లు చికిత్స చేయాల్సిందే. వేల రూపాయలు ఖర్చుచేస్తే కానీ ప్రైవేటు ఆస్పత్రులలో అందుబాటులో రాని డయాలసిస్ చికిత్స ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారు. ఈ కేంద్రంలో పాతబస్తీవాసులే కాకుండా నగర శివారు ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సేవలందిస్తున్నది.

ప్రతిసారి కొత్త డయలైజర్ వాడకం

రోగి రక్తశుద్ధి ప్రక్రియలో డయలైజర్ కిట్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది బహిరంగ మార్కెట్‌లో రూ.2500 నుంచి రూ.3వేల వరకు ఉంటుంది. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకునే రోగులకు ఒక్కో డయలైజర్ రెండు నుంచి నాలుగు సార్లు వాడతారు. దీంతో రోగులకు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. మలక్‌పేట ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో ప్రతిసారి కొత్త డయలైజర్ వాడటంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వయస్సును బట్టి 10లీటర్ల నుంచి 14లీటర్ల వరకు రక్తం శుద్ధి జరుగుతుంది.

రోజుకు నాలుగు విడతల్లో సేవలు..

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రోజు తప్పించి రోజు లేదా వారానికి మూడు సార్లు తప్పనిసరిగా రక్త శుద్ధి చేయాల్సి ఉంటుంది. లేదంటే వారి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంటుంది. కేంద్రం ప్రతి రోజు ఉదయం 6గంటలు, 10గంటలు, మధ్యాహ్నం 2గంటలు, సాయంత్రం 6గంటలకు కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు అందిస్తారు. రోజువారీగా వచ్చే బాధితులు తమకు అనుకూలమైన సమయాన్ని ఎంచుకుని చికిత్స పొందుతున్నారు. ఒక్కో వ్యక్తికి నాలుగు గంటల పాటు శుద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి బాధితుడికి వారంలో మూడు రోజుల పాటు ముందస్తుగా కేటాయించిన సమయం ప్రకారం డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.

సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ

సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండడంతో భయం లేకుండా చికిత్స చేయించుకుంటున్నాం. ఈ డయాలసిస్ కేంద్రంలో సౌకర్యాలు బాగున్నాయి. ముందుగా కేటాయించిన సమయం ప్రకారం నేరుగా వచ్చి రక్తశుద్ధి చేసుకుని వెళ్తాం. అవసరమైన సలహాలు, సూచనలు సిబ్బంది అందజేస్తున్నారు.

- శ్రీనివాస్‌రావు, ఎల్బీనగర్

కేంద్రంలో మెరుగైన సేవలందిస్తున్నారు

కొద్ది నెలలుగా మలక్‌పేట కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒకే డయలైజర్ మూడు, నాలుగు సార్లు వాడుతారు. ఇక్కడ ప్రతి ఒక్కరికీ కొత్త డయలైజర్ వాడుతున్నారు. కేంద్రం నిర్వహణ సైతం బాగా ఉంటుంది. ఇక్కడి సేవలు ప్రైవేటు ఆస్పత్రుల్లో కంటే మెరుగ్గా ఉన్నాయి.

- రాజు, ఎల్బీనగర్



డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

24గంటలు సేవలు అందిస్తున్నాం

ఈ కేంద్రంలో 24గంటలు కిడ్నీ రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. బాధితులు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ముందస్తుగా సమయం కేటాయిస్తున్నాం. పది యంత్రాలతో ఒక్కొక్కరికి నాలుగు గంటల చొప్పున రక్తశుద్ధి చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు నాలుగు విడతల్లో 40మంది వరకు సేవలందిస్తున్నాం.

- అబ్దుల్ రహ్మాన్, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి

పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే

గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆవుల సైదులు, పోలు జోసెఫ్

చాదర్‌ఘాట్, మే 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం ప్రతినిధులు శుక్రవారం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని కలిసి పాఠశాలల పునః ప్రారంభానికి ముందే గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు ఆవుల సైదులు, ప్రధాన కార్యదర్శి పోలు జోసెఫ్ కోరారు. పాఠశాలల ప్రారంభానికి ముందే బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి చేసిన తర్వాతే కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలని, గ్రేడ్-2 ప్రిన్సిపాల్ పోస్టులు మొత్తం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. టీజీటీ జూనియర్ లెక్చరర్ పోస్టులను 70శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు పదోన్నతుల చానల్ ఏర్పాటు చేయాలని, గురుకుల ఉపాధ్యాయులకు నైట్ స్టేను తొలగించాలని, గురుకులాల్లో కేర్‌టేకర్ పోస్టులు భర్తీ చేసి ఉపాధ్యాయులను కేర్ టేకర్ బాధ్యతల నుంచి విముక్తి చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల టైమింగ్స్‌ను గురుకుల డిగ్రీ కళాశాలలకు వర్తింపచేయాలని, పీహెచ్‌డీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పదోన్నతి పొందకుండా ఒకే క్యాడర్‌లో ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరికి ఆరు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రికార్డ్ అసిస్టెంట్లు లేని పాఠశాలలు, కళాశాలలకు రికార్డు అసిస్టెంట్లను నియమించాలని, ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్‌లకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే గురుకుల ఉపాధ్యాయులకు కూడా జీరో వన్ జీరో ద్వారా వేతనాలు ఇవ్వాలని ఎమ్మెల్సీకి విన్నవించారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షులు తాడూరి అరుణ్‌కుమార్, ఆవ మల్లయ్య, వైసంతోష్, సంయుక్త కార్యదర్శి జల్లాపురం చిన్నస్వామి, కోశాధికారి కృష్ణారెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడు ప్రవీణ్ పాల్గొన్నారు.



శాలివాహన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి వైద్య బృందం సౌజన్యంతో శాలివాహన నగర్‌కాలనీ పార్క్‌లో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షా శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలని క్లబ్ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, కార్యదర్శి పి.కమలాకర్, కోశాధికారి యాదయ్యయాదవ్ సూచించారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలతో పాటు వైద్య పరీక్షా శిబిరాలకు వాకర్స్ నుంచి స్పందన లభిస్తుందన్నారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

భక్తి శ్రద్ధలతో మన్యుసూక్త హోమం

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి కాలనీలోని గోదాస మేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి గుడి ఎదుట శుక్రవారం అర్చకస్వాములు జగదీష్‌స్వామి, మహంకాళి రవి కుమార్ స్వామి భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక అర్చనలు చేయించారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్నకృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన ఘనత కేసీఆర్‌దే

- మాజీ మంత్రి సబితారెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని, ఆయన లేకుంటే తెలంగాణే లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వాల్‌పోస్టర్లను శుక్రవారం మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణను తీసుకవచ్చారని, కేసీఆర్ దీక్ష చేపట్టకపోతే అసలు ఉద్యమమే లేదని అన్నారు. మూడు రోజుల దశాబ్ది ఉత్సవాలను కేసీఆర్, కేటీఆర్‌ల పిలుపు మేరకు అన్ని ప్రాంతాల్లో ఘనంగా జరుపుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ప్రధాన కూడళ్లలో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాలని, ఆదివారం సాయంత్రం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు, ఉద్యమకారులకు సన్మానం చేయాలని అన్నారు. ఇక చివరి రోజైన సోమవారం ప్రతి ఒక్కరూ జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండా పట్టుకుని స్థానికంగా గల ప్రభుత్వ ఆస్పత్రులు, అనాథ శరణాలయాలకు వెళ్లి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయాలని సబిత పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ బాధ్యులు ఆయా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం జిల్లెలగూడ చందచెరువు కట్టపై గల అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమానికి తాను హాజరుకానున్నట్టు సబిత తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్‌శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, బడంగ్‌పేట్ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్‌పాషా, సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్యబీరప్ప, నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, లలితాజగన్, ఆర్.గోపాల్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సైదాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల బకాయి అద్దె అడిగితే కోపంతో ఓ మహిళ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంపాపేట రెడ్డికాలనీలో బావోజీ లక్ష్మణాచారి తల్లి వరలక్ష్మి(54)తో కలిసి ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలలుగా ఇంటి అద్దె కట్టకపోవడంతో యజమాని వరలక్ష్మిని అడిగింది. దీంతో ఆమె కోపంతో ఇంటికి తాళం వేసి కీని ఇంటి యజమానికి ఇచ్చి గురువారం సాయంత్రం బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న కొడుకు తల్లి కోసం వెదకగా ఆచూకీ లభించలేదు. దీంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి..



హయత్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన గృహిణి అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వడల చందన (32) భర్త జిలకర శ్రీనుతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీలో 109/7బ్లాక్‌లో నివాసం ఉంటుంది. కాగా చందన ఈనెల 13వ తేదీన పుట్టిల్లు నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జి మండల్‌లోని రాణిపేట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కానీ అక్కడికి చేరుకోలేదు. దీంతో భర్త శ్రీను తెలిసిన కుటుంబ సభ్యుల వద్ద విచారించినా ఫలితం దక్కలేదు. గురువారం సా యంత్రం తన భార్య కనిపించడం లేదని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ..



హయత్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): కూలీ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర లింబా గ్రామానికి చెందిన రామేశ్వర్ శివాజీ షిండే(31) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి ఉమర్‌ఖాన్‌గూడలో నివాసం ఉంటున్నారు. రామేశ్వర్ శివాజీ షిండే కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం తన భర్త కనిపించడం లేదని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా కార్మికులను రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న క్రీడా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులు

హయత్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడ)లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో క్రీడా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ క్రీడా గేటు ఎదుట ధర్నా చేశారు. కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యూలర్ చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చేయాలని, కార్మికులందరికీ రెండు జతల యూనిఫాంలు, షూలు ఇప్పించాలని, నెలకు 26 పని దినాలు కల్పించాలని, కార్మికులకు సరిపడ బడ్జెట్ కేటాయించాలని, జాతీయ పండగలకు, సాధారణ పండగలకు సెలవు దినాలతో పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. 30 రోజుల పని దినాలు పూర్తి చేసిన కార్మికులందరికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో క్రీడా యాజమాన్యం విఫలం అవుతుందన్నారు. క్రీడాలో దాదాపు 20 సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారందరిని గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. రోజుకు కేవలం రూ. 406 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కనీసం 20 రోజులకు మించి పనులు లభించడం లేదని విచారం వ్యక్తం చేశారు. 30 రోజులు మించి పని చేసిన కార్మికులకు 8.33 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రావుల రాజు, యాదయ్య, నాగయ్య, రాజు, లావణ్య, రమాదేవి, సుశీల, చంద్రకళ, లక్ష్మిబాయి, అక్షరమ్మ పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీలో కూలీ మృతి



నాగరాజు మృతదేహం

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో ఓ కూలీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగరాజు(47) అనే వ్యక్తి తనకు ఏదైనా పని ఇప్పించాలని తనను కోరడంతో కొన్నాళ్లు ఎన్‌టీఆర్‌నగర్‌లో ఉండే మోటాటి నర్సింహారెడ్డి అనే కూలీ అతడికి కూలీ పని ఇప్పించగా, వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు, ఫుట్‌పాత్‌పై నిద్రపోయేవాడు. అతడికి నాగరాజు తన వివరాలు ఏవీ చెప్పలేదు. ఆ తర్వాత నాగరాజు అనారోగ్యానికి గురయ్యాడు. శుక్రవారం డాక్టర్స్ కాలనీలో ప్రజయ్ టవర్స్ వద్ద అతడు స్పృహలేకుండా పడిపోయి ఉన్నాడని తెలిసి నర్సింహారెడ్డి అక్కడికి వెళ్లి చూడగా అతడు మృతిచెందాడని గుర్తించాడు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నాగోల్ పీఎస్ పరిధిలో



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాగోల్ పీఎస్ పరిధిలోని ఇందూ అరణ్య వద్ద శుక్రవారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అతడిని గుర్తుపట్టేవారు 8712662723, 8712662751 నెం.ద్వారా సంప్రదించాలని పోలీసులు కోరారు.

ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు.

- **ట్యాంక్ బండ్ పరిసరాల్లో..**

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2రాత్రి 12గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపునకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్ రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్‌హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు.

- **గన్‌పార్క్ పరిసరాల్లో..**

సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది.

- **పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో..**

బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చేవాహనాలను సీటీఓ, తివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపు నుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చేవాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు.

ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్, ప్లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.